క్లుప్తంగా

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ వియ్యపు చక్రపాణి

రేగిడి: మండలంలోని కొండలమామిడివలస గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు అందజేయాలని సర్పంచ్ వియ్యపు చక్రపాణి కోరారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్య నారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వండానపేటకు చెందిన మాజీ సర్పంచ్ వియ్యపు సూర్యనారాయణ పేదల ఇళ్లనిర్మాణం నిమిత్తం అప్పట్లో 24 మందికి ఇక్కడి భూమిని కేటాయించారని, పేదలు ఇళ్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారని తెలిపారు. అయితే కొంతమంది వ్యక్తులు ఈ భూమి తమదని కోర్టుకు వెళ్లారని, రెవెన్యూ అధికారులు గ్రామంలోని భూమిని సర్వే చేసి, అర్హులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డీటీ భూములు పరిశీలించి, రికార్డుల ప్రకారం పేదలకు ఇచ్చే అధికారం ఉంటే తప్పనిసరిగా న్యాయం చేస్తామన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు కలిసి ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు చేసిన కృషిని కొనియాడారు. ప్రతీ విద్యార్థి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి కనబరచాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి కనబరచాలని, అలా అయితేనే పరిజ్ఞానం పెరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు అన్నారు. మండలంలోని డోలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ముందుకు రావాలని, తద్వారా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ కో–ఆర్డినేటర్ టి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ కాలువల నిర్మాణం



కవిరాయునివలసలో జరుగుతున్న కాలువల నిర్మాణ పనులు

తెర్లాం: మండలంలోని కవిరాయునివలస గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతోంది. ఈ పనులను మండల ఇంజినీరింగ్ అధికారి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షిస్తున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తిరుపతినాయుడు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష



నేత్రవైద్య తనిఖీలు చేస్తున్న వైద్యుడు

మెంటాడ: మండలంలోని కైలాం గ్రామంలో సర్పంచ్ గండి శ్యామలాదేవి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి చింతలవలస, అమరాయివలస, కైలాం గ్రామాల నుంచి 351 మంది హాజరై, ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్య సిబ్బంది ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సూర్యనారాయణ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్.. నాయుడువలస

- ప్రగతి పట్టాలెక్కిన నాయుడువలస గ్రామం
- రూ.కోట్లల్లో సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు లబ్ధి
- నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలకు కొత్తరూపు
- ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు
- గ్రామంలోనే ప్రభుత్వ సేవలందేలా సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్‌ల నిర్మాణం
- జగనన్న సర్కారుపై హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రూ.26 లక్షల నిధులతో కార్పొరేట్‌కు దీటుగా మార్చిన ప్రాథమికోన్నత పాఠశాల

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస గ్రామం సంక్షేమానికి, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. పేదరికం రూపుమాపుతామని కొన్ని దశాబ్దాలుగా ఏలిన పాలకులు హామీలిచ్చారే కానీ.. వాటిలో ఏ ఒక్కటీ ఆచరణలో చూపించలేదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు కూడు, గుడ్డ, ఇల్లు కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలిది. అయితే ఇవేవీ కల్పించని దుస్థితి నాడు టీడీపీ హయాంలో కనిపించేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నెల రోజుల వ్యవధిలోనే సంక్షేమ పథకాలతో పేదల జీవన స్థితిగతులు మార్చేందుకు శ్రీకారం చుట్టారు. వారు ఆర్థిక ఎదుగుదలకు పునాదులు వేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. 2102 మంది జనాభా, 1686 మంది ఓటర్లున్న నాయుడువలస గ్రామంలో ఈ నాలుగున్నరేళ్లలో కొన్ని రూ.కోట్ల విలువైన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు జరిగాయి. ఇదే గ్రామ సచివాలయ పరిధిలోని పాలవలస, నాయుడువలస గ్రామాల్లో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. వివక్షకు తావులేకుండా అభివృద్ధి పనులు సైతం జరిగాయి. టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామం ఇది. జగనన్న సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. గ్రామంలో కొత్తగా సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలను నిర్మించారు. గ్రామస్తులు ఎక్కడికి వెళ్లకుండా ఉన్న ఊర్లోనే ప్రభుత్వ సేవలు పొందేలా గ్రామంలోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే), వెల్‌నెస్ సెంటర్‌లు నిర్మించారు. ఇవేకాకుండా నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తయి కార్పొరేట్ పాఠశాలలను తలపిస్తున్నాయి. వీటితో కొంతమేర ఇబ్బందులు తీరాయని పంచాయతీ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధి పనులు ఇలా..

గ్రామంలో సుమారు రూ.65 లక్షల వ్యయంతో సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలను నిర్మించారు. మరో రూ.20 లక్షల జీజీఎంపీ(గడప గడపకు మన ప్రభుత్వం) నిధులు, రూ.2.50 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు నిర్మించారు. నాడు–నేడు పథకం కింద మొదటి దశలో రూ.26 లక్షల వ్యయంతో ప్రాథమికోన్నత పాఠశాల రూపురేఖలు మార్చారు. పాఠశాల అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు కల్పించారు. అలాగే గ్రామంలో 16 మందికి పైబడి అర్హులైన నిరుపేదలకు జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు అందించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు..

ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పింఛన్లు, విద్యాదీవెన, వసతిదీవెన, అమ్మఒడి, విద్యాకానుక, చేయూత, ఆసరా తదితర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.11,83,37,000 ప్రత్యక్షంగా బదిలీ కాగా పరోక్షంగా రూ. 2,93,07,000లు మొత్తంగా రూ. 14,76,44,000 ప్రయోజనం చేకూరింది.



రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం

జగనన్న చేసిన మేలు మరవలేం..



సీఎం జగనన్న చేసిన మేలు మరువలేం. ఆయన పుణ్యమా అని మాలాంటి వారు ఎన్నోఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరికింది. నాకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ వంటి సంక్షేమ పథకాలు అందాయి. వాటితో నాకు ఆర్థిక భరోసా కల్పించారు. అలాంటి మహానుబావుడి మేలు జన్మాంతం మరిచిపోలేము, జగనన్న రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

– తాడ్డి రవణమ్మ, నాయుడువలస గ్రామం.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. వలంటీర్ల ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. మళ్లీ మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నాం.

– నడిమింటి లక్ష్మి, సర్పంచ్, నాయుడువలస గ్రామం.

పంచాయతీలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు..		
పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందించిన లబ్ధి
రైతు భరోసా	414	రూ.1,84,84,800
సున్నావడ్డీ పంట రుణాలు	96	రూ.2,36,754
ఇన్‌పుట్ సబ్సిడీ	10	రూ.25,378
వైఎస్సార్ పింఛన్	407	రూ.4,10,97,250
వైఎస్సార్ చేయూత	188	రూ.87,37,500
వైఎస్సార్ ఆసరా	574	రూ.1,96,00,949
జగనన్న తోడు	28	రూ.17,261
వైఎస్సార్ సున్నావడ్డీ	635	రూ.18,27,000
జగనన్న చేదోడు	19	రూ.5,20,000
వైఎస్సార్ కాపునేస్తం	03	రూ.1,65,000
ఈబీసీ నేస్తం	03	రూ.90,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	97	రూ.35,58,510
ఆరోగ్య ఆసరా	49,	రూ.3,70,600
హౌసింగ్ లబ్ధిదారులు	38	రూ.53,93,396
వైఎస్సార్ బీమా	05	రూ.9,25,000
జగనన్న విద్యాదీవెన	210	రూ.60,04,200
జగనన్న వసతిదీవెన	164	రూ.26,93,639
జగనన్న అమ్మఒడి	246	రూ.15,87,600
వైఎస్సార్ వాహనమిత్ర	23	రూ.7,30,000
కోవిడ్ సహాయం	598	రూ.5,98,000

పరోక్ష ప్రయోజనం వివరాలు..		
ఇంటి స్థలం	40	రూ.98,40,000
జగనన్న విద్యాకానుక	159	రూ.11,29,218
ట్యాబ్‌ల పంపిణీ	26	రూ.3,43,772
జగనన్న తోడు(రుణాలు)	78	రూ.14,52,282
జగనన్న గోరుముద్ద	159	రూ.15,75,213
సంపూర్ణ పోషణ	90	రూ.16,85,700
ఇంటింటికీ రేషన్	608	రూ.1,32,81,152



ప్రజారోగ్యమే లక్ష్యంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్



రూ.16 లక్షల జీజీఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు



నాయుడువలస గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయం

బకాయి రుణాలు వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఏసీ చిరంజీవి

వంగర: మహిళా స్వయం శక్తి సంఘాల నుంచి బకాయి రుణాలు వసూలు చేయాలని రాజాం వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు, వీవోఏలతో సమావేశమైన ఆయన కాసేపు మాట్లాడారు. వెలుగు ద్వారా మండలంలోని 30 గ్రామైక్య సంఘాల్లో రూ.48 లక్షల రుణాల వసూళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే వసూలు చేయాలన్నారు. మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, హెచ్‌డీఐఎఫ్, ఎస్‌వీఐఎఫ్, ఎంకేఎస్‌పీ వంటి రుణాలను మంజూరు చేసి, వారి జీవనోపాధులు మెరుగుపరచాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు నాలుగో విడత ఆసరా డబ్బులు సంఘాలకు జమచేశారని, సంఘ సభ్యులు తీర్మానాలు చేసి, ఆ సొమ్మును మహిళల వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలన్నారు. వెలుగు సిబ్బంది కూడా చిత్తశుద్ధితో పనిచేసి అన్ని రంగాల మహిళలను ప్రోత్సహించి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళా సంఘాల పూర్తి డేటాను లోకోస్ యాప్‌లో పొందుపరచాలని, ఈ ప్రక్రియ మార్చి మొదటి వారంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.ఎం.ఎస్.అధ్యక్షురాలు కాంబోతుల భగవతి, స్త్రీనిధి మేనేజర్ వి.సుధాకర్, ఏపీఎంలు మీసాల చక్రపాణి, తెర్లి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

తెర్లాం: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను కార్యకర్తలు సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–3లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆమె కార్యకర్తలను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. ప్రతిరోజూ కేంద్రాలను నిర్ణీత సమయంలోగా తెరవాలని, ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలని, వారికి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందివ్వాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను ఆన్‌లైన్‌లోను, ఆఫ్‌లైన్‌లోనూ నిర్వహించాలన్నారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచి, గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని ఆమె హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

బాడంగి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పక్కాగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని రేజేరు, బాడంగి, రామచంద్రాపురం సెక్టార్‌ల వారీగా అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం సమావేశమైన ఆమె కేంద్రాల నిర్వహణ పక్కాగా ఉండాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రీస్కూల్ నిర్వహణ ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు అట్టలు అందజేస్తున్న సిరిసహస్ర

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులంతా పబ్లిక్ పరీక్షలు బాగా రాసి, ఉత్తమ ఫలితాలు సాధించాలని చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర ఆకాంక్షించారు. మండలంలోని పొగిరి, కంచరాం, డోలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలకు మంగళవారం వెళ్లిన ఆమె అక్కడి పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి, పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. క్రమశిక్షణతో చదువుకోవడంతో పాటు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని, ఇటు పాఠశాలకు, అటు తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్.సత్యనారాయణ, వి.వి.వసంతకుమార్, మురళీకృష్ణ, పీఎంసీ చైర్మన్ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)లో పదో తరగతి విద్యార్థులకు మండలంలోని సంకిలి దగ్గరున్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం పరీక్ష కిట్లు మంగళవారం అందజేసింది. పరీక్షలు రాసేందుకు ఉపయోగపడేలా పెన్నులు, అట్టలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కర్మాగారం ఏవీపీ పట్టాభిరామిరెడ్డి, డీజీఎం జె.రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

12 మద్యంసీసాల స్వాధీనం

వంగర: మండలంలోని మరువాడ జంక్షన్ వద్ద ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 12 మద్యంసీసాలను మంగళవారం అరెస్ట్ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాములు సోమవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు.

రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

బాడంగి: మండలంలోని భీమవరం గ్రామంలో రూ.4 లక్షల వ్యయంతో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్‌లకు వెళ్లే దారిలో 3.75 మీటర్ల వెడల్పు, 75 మీటర్ల పొడవైన రోడ్డును నిర్మిస్తున్నట్లు పీఆర్ డీఈఈ అప్పారావు తెలిపారు. త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

నేడు వలంటీర్లకు వందనం, ఇళ్లపట్టాల పంపిణీ

మెంటాడ: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం, ఇళ్లపట్టాల పంపిణీ బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు వలంటీర్లకు వందనం, మధ్యాహ్నం 2 గంటలకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాలు జరుగుతాయని, ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర హాజరవుతున్నారని పేర్కొన్నారు.

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: పట్టణ ప్రజలకు బుధవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పాడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. పట్టణ పరిధిలోని భోజరాజపురం దగ్గరున్న ప్రధాన తాగునీటి వనరుల కేంద్రం వద్ద పంపింగ్ సిస్టం నిర్వహణ పనుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, ప్రజలు సహకరించాలని కోరారు.

తాగునీరు వృథా చేయొద్దు

రేగిడి: తాగునీరు వృథా చేయవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ సూచించారు. మండలంలోని చిన్నయ్యపేట, సంకిలి, బొడ్డవలస గ్రామాల్లోని ఇంటింటి తాగునీటి కుళాయిలను ఆయన మంగళవారం పరిశీలించారు. వేసవి నేపథ్యంలో ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుళాయిల వద్ద బట్టలు ఉతకడం, తడపడం, ఇంటి నిర్మాణాలకు పైపుల ద్వారా నీటిని తరలించడం వంటివి చేయవద్దన్నారు.

జోరుగా ఉపాధి పనులు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. మంగళవారం తోటపల్లి పిల్లకాలువ వద్ద పనులు జరగ్గా, ఈ పనులను ఏపీవో ఎస్.హరనాధరావు పరిశీలించి, పలు సూచనలు చేశారు. కొలతల ప్రకారం రెండు పూటలా పనిచేయాలని తెలిపారు. పనిలోకి వచ్చిన వారికే మస్తర్లు వేయాలన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందివ్వడమే లక్ష్యం

- ఎస్‌బీఐ డీజీఎం దేవీలాల్ మెహ్రో

రామభద్రపురం: ఖాతాదారులకు మెరుగైన సేవలందివ్వడమే ఎస్‌బీఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) లక్ష్యమని డీజీఎం దేవీలాల్ మెహ్రో అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ సేవా కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఆయన ఖాతాదారుల శ్రేయస్సుకు ఎస్‌బీఐ పెద్దపీట వేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ఏపీవై, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవైలకు ప్రతీ ఖాతాదారు బీమా చేయించుకుని, ప్రయోజనం పొందాలన్నారు. ఖాతాదారు కేవలం రూ.450 చెల్లిస్తే ప్రమాద, సాధారణ మరణానికి చెరో రూ.2 లక్షలు చొప్పున కుటుంబ సభ్యులకు అందుతుందన్నారు. సత్వర సేవలందించేందుకు ఎస్‌బీఐ పరిధిలో సేవాకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కేంద్రాలను వినియోగించుకుని, సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌ను సందర్శించి, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ కళ్యాణ్ తేజస్వి, స్థానిక బ్రాంచ్ మేనేజర్ సతీష్‌కుమార్, సీఎస్‌పీ సత్యారావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ సేవాకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం దేవీలాల్ మెహ్రో

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్



టాబ్‌ల వినియోగంపై ఆరాతీస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

రాజాం: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కృషి చేయాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. మండలంలోని బొద్దాం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన పాఠశాల నాడు–నేడు పనులపై ఆరాతీశారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయుడు గురుమూర్తికి తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని ఏ విధంగా అమలు చేస్తున్నారని అడిగి, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలన్నారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించిన ఆయన ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. బోధనలో ఉపాధ్యాయుల నవీన విధానాలు ఆచరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి అలవాట్లు అలవర్చుకోవాలి

రేగిడి: విద్యార్థులు బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని ఖండ్యా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆయుర్వేద వైద్యం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. క్రమశిక్షణ కలిగి ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, ఉదయం, సాయంత్రం యోగాసనాలు వేయాలని, ఉదయం త్వరగా నిద్రలేవాలని తెలిపారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆయుర్వేద వైద్యాన్ని పరిచయం చేసేందుకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని, ఇక్కడి విద్యార్థుల్లో చాలామందికి ఐరన్ తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. శరీరంలో ఐరన్ తక్కువగా ఉంటే ఎనిమీయా వ్యాధి వచ్చే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు

రాజాం: పట్టణ పరిధిలోని పొనుగుటివలస జంక్షన్ నుంచి సంతకవిటి ప్రాంతానికి వెళ్లే దారిలో రోడ్డు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. రోడ్ల నిర్వహణ నిధులతో అక్కడక్కడ ఏర్పడిన గోతులను పూడ్చి, లైనింగ్ పనులు చేయిస్తున్నామని ఏఈ నాగభూషణరావు తెలిపారు. రోడ్డు బాగు చేయడంతో ప్రయాణికులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.